بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ   نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ   وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 25.8.2017 (TELUGU)**

## ఆఁహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను నిజమైన ప్రవక్తగా నమ్మినప్పుడు వారి ప్రతి ఆచరణ మనకు ఆదర్శమే ప్రార్థనలతో పాటు వారి గొప్ప ప్రవర్తనలు మనకు ఉదాహరణే

## ఆఁహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పట్ల ప్రేమాభిమానం కేవలం నోటి మాటలే కాకూడదు, నినాదాలు మాత్రమే చేయకుండా వారి గొప్ప ఆదర్శమును అనుసరించుచు ఈ ప్రేమాభిమానాన్ని చాటుకోవలెను

*హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 25.8.2017 తేదీన జర్మనీలో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించిరి.

సభలో పాల్గొనుటకు నేడు మనమిక్కడ సమావేశమైనాము. ఏదో ప్రాపంచిక ఆనందము లేదా కేరింతలు లేదా ఏదో ప్రాపంచిక ఉద్ధేశము కొరకు కాక ఇక్కడి కార్యక్రమాలలో పాల్గొని ఒక ఆధ్యాత్మిక వాతావరణములో యుండి తమ ఆధ్యాత్మికతను పెంచుకోవాలని, తమ విద్యా ప్రామాణాలను పెంచుకోవాలని, తమ విశ్వాస స్థితిని మెరుగుపరచుకోవాలని, తమ ఆచరణా స్థితులను తీర్చిదిద్దుకోవాలని, అల్లాహ్ తఆలా భీతిని అవలంభించాలని, అల్లాహ్ తఆలా హక్కులు, అతని దాసుల హక్కులు చెల్లించాలని మనిమిక్కడి సభకు చేరినమాని ప్రతి అహ్మదీకి తెలుసు. ఈ సభలో పాల్గొను మన ఉద్ధేశమేమిలో సదా మనము గుర్తుంచుకోవలెను.

నేనిప్పుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం కొన్ని పంక్తులను ప్రవేశపెట్టెదను. విశ్వాసముల ప్రభావము ఆచరణపై పడునని తెలుపుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి. రెండు భాగాలలో ఇస్లాం గలదు. దేవునితో మరొకరిని జోడించకుండా, అతని ఉపకారముల వలన అతని పట్ల పూర్తి విధేయత అవలంభించుట ఒకటి. ప్రాణుల హక్కులను గుర్తించి సాధ్యమైనంత వరకు చెల్లించుట రెండవది.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. నిజమైన, లోపరహిత విశ్వాసము గల వ్యక్తి దేవునితో మరొకరిని జోడించడు. తద్వారా సత్కర్మలు వాటంతట అవే వెలువడును. నిజమైన విశ్వాసములను ముస్లిములు వీడినప్పుడు తుదకు దజ్జాల్ మొ॥ వారిని దేవుళ్లుగా విశ్వసించడం మొదలు పెట్టిరి.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. పెద్ద పెద్ద ప్రభుత్వములు కూడ ప్రాపంచిక శక్తులను దేవుళ్ళుగా నమ్మి వాటి కోగిట్లో పడినట్లు మనము ప్రపంచములో చూచుచున్నాము. మనకిది నేడు ప్రతి చోట కనిపించుచున్నది. ప్రజల నుండి ముస్లిం ప్రభుత్వముల వరకు ఈ స్థితి గలదు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. పవిత్ర ఖుర్‌ఆన్‌లో ప్రతి శుభము గలదని దేవుడు నాకు పదే పదే చెప్పాడు. దేవుడు ఒక్కడే, అతనికెవరు సమానముగా లేరనేదే దాని బోధన. ఖుర్‌ఆన్ చెప్పిన విషయము పూర్తిగా నిజమే. శుభములన్నిటిని పవిత్ర ఖుర్‌ఆన్‌లో అన్వేషించుము. అల్లాహ్ తఆలాను ఆరాధించుము. అతని హక్కులు చెల్లించుము. మానవుల హక్కులు కూడ చెల్లించగలరు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. అల్లాహ్ తఆలా జ్ఞానమును పొందుట, దుఆ, ప్రార్థన వాస్తవికతను తెలుసుకొనుటకే ఈ సంస్థ స్థాపించబడెను. వారిట్లనిరి. కేవలం దుఆ చేసి ప్రయత్నించని వ్యక్తి తప్పు చేసినట్లే ప్రయత్నము మాత్రమే సరిపోవునని నమ్మిన వ్యక్తి కూడ నాస్తికుడే. ప్రయత్నము, దుఆను రెండింటిని కలుపుటయే ఇస్లాం.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. పాపము, నిర్లక్ష్యము నుండి తప్పించుకొనుటకు శక్తిమేర ప్రయత్నించవలెను. సాధ్యమైనత వరకు దుఆ చేయవలెను. అందుకే పవిత్ర ఖుర్‌ఆన్‌లోని మొదటి అధ్యాయము ఫాతిహాలోనే ఈ రెండు విషయములను దృష్టిలో యుంచుకొని ఇట్లనెను. విశ్వాసి ఇయ్యాక నాబుదు అనగా మేము

నిన్నే ఆరాధింతుమని అన్నప్పుడు అల్లాహ్ తఆలా శుభము, కరుణ లేనిదే అతన్ని ప్రార్థించు శక్తి నా కెక్కడిదని అతనికి వెంటనే ఆలోచన కలుగును. అందుకే తక్షణమే ఇయ్యాక నస్తయీన్ అనగా నిన్నే సహాయమర్థింతునని అనును. ఇదొక సున్నితమైన విషయము. దీనిని ఇస్లాం తప్ప మరే ధర్మము అర్థము చేసుకోలేదు. కాని నేటి కాలములో ప్రజల స్థితిని నేను చూచునదేమనగా వారు ప్రయత్నములు చేస్తారు కాని దుఆ పట్ల నిర్లక్ష్యము వహింతురు. వస్తువులను ఎంతగా నమ్ముకున్నారనగా ప్రయత్నములనే దేవుళ్లుగా భావించుచున్నారు. దుఆ పట్ల హాస్యము చపుచు దుఆను ఒక అనవసర వస్తువుగా పరిగణించుచున్నారు. యూరప్‌ను అనుసరించినందున ఈ ప్రభావమంతా పడినది. ప్రపంచములో వ్యాపించుచున్న ఈ విషము చాలా ప్రమాదకరమైనది. ఈ విషమును రూపుమాపదలచి అల్లాహ్ తఆలా ఈ సంస్థను ప్రారంభించెను.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. నామమాత్రముగా బైఅత్ చేసి, నన్ను ఇమామ్‌గా భావించుట మాత్రమే మోక్షము కొరకు అసలే సరిపోదు. ఎందుకనగా అల్లాహ్ తఆలా హృదయాలను గమనించును, అతడు నోటి మాటలను చూడడు. అల్లాహ్ తఆలా పదే పదే చెప్పినట్లు మోక్షము కొరకు ఇది తప్పనిసరి. అనగా మొదట అల్లాహ్ తఆలాను నిజమైన హృదయముతో ఏకైక దేవుడు, అతనికి సమానులు మరొకరు లేరని భావించవలెను. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను సత్యమైన ప్రవక్తగా నమ్మవలెను. ప్రళయ దినము వరకు మరొక గ్రంధము లేదా శాసనము అవతరించదనే విధముగా పవిత్ర ఖుర్‌ఆన్‌ను అల్లాహ్ తఆలా గ్రంధముగా నమ్మవలెను.

ఈ సంస్థ అవసరమేమిటని విమర్శించేవారు చాలా మంది యున్నారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వచ్చి ఒక క్రొత్త సంస్థను ప్రారంభించిరి, దీని అవసరమేమిటి? అని అంటారు. ఇట్లనిరి. విశ్వాస స్థితి బలహీనమగుచు ఎంత వరకు దిగజారినదనగా విశ్వాస శక్తి పూర్తిగా అదృశ్యమయ్యెను. ఈ సంస్థ ద్వారా అల్లాహ్ తఆలా నిజమైన విశ్వాస స్ఫూర్తిని నింపదలచెను. కనుక ప్రజల విమర్శ అర్థరహితం. ఇటువంటి సందేహము ఎవరి హృదయములో రాకూడదు. చిత్తశుద్ధితో గమనించినచో ఈ సందేహము రానే రాదు. మానవున్ని పాప మరణము నుండి రక్షించగల నిజమైన శాంతిని మేము స్థాపించదలచితిమి. ఆచారములు, అలవాట్లను పాటించే ఈ ప్రజలలో ఆ విలువలు లేవు. వారి చూపు బాహ్యముపైనే గలదు. వాస్తవమును వారు చూడడం లేదు. వారి చేతిలో గూదము లేని పొట్టు మాత్రమే గలదు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. అల్లాహ్ తఆలాతో నిజమైన సంబంధము ఏర్పరచుట వారి అవతరణ ఉద్దేశమైనచో, ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వైభవమును గుర్తింపజేయదలచినచో, పవిత్ర ఖుర్‌ఆన్ అధికారమును ఏర్పాటుచేయదలచినచో వారిని విశ్వసించే మనము మన విశ్వాస, ఆచరణ స్థితులను అందుకు తగిన విధముగా చక్కదిద్దుకోవలసిన అవసరమున్నది. మన బైఅత్ వాస్తవానికి తగ్గట్లుగా యున్నదా లేక కేవలం నోటి మాటలేనా అని మనము గమనించవలెను. మనము అల్లాహ్ తఆలాను ఏకైక దేవుడు, అతనికి సమానముగా మరొకరు లేరని భావించుచు మన ప్రార్థనలు అతనికి అంకితమేనా ? అని గమనించవలెను. ఐదు పూటలు నమాజ్ చేయనివారు చాలా అహ్మదీయులున్నారు. నాతో భేటి అయినప్పుడు ప్రజలు నమాజులు చదివేలా దుఆ చేయగలరని అంటారు. వాస్తవానికి ఇదొక ప్రాథమిక విషయము. ప్రతి అహ్మదీయుని కర్తవ్యము. ప్రతి విశ్వాసి కర్తవ్యము. ప్రతి ముస్లిం కర్తవ్యము. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బైఅత్‌లో చేరిన తరువాత ఎంతో ఉత్సాహము, ఆసక్తితో నమాజులు సలుపవలెను. నమాజులు చేయకుండా మేము నమాజులు చేసేందుకు దుఆ చేయగలరని అనుట విడ్డూరం. నమాజులు చదవడం లేదనే భావన యున్నప్పుడు ఏదో ఒక ఉపాయము చేయవలెను, స్వయముగా ప్రయత్నించవలెను. స్వతహాగా ప్రయత్నము, దుఆ ఎందుకు చేయరు. ఇయ్యాక నాబుదు వ ఈ ఇయ్యాక నస్తయీన్ అన్నప్పుడు నోటితో మాత్రమే అనే బదులు మనస్ఫూర్తిగా అంటూ ఎందుకు ఆచరించరు. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను నిజమైన ప్రకవ్తగా నమ్మినప్పుడు వారి ప్రతి కర్మ మనకు ఆదర్శమే. ప్రార్థనలతో పాటు వారి సద్గుణములు మనకు ఆదర్శమే. సామాజిక సంబంధములు గలవు. కుటుంబ సంబంధములు గలవు. భార్యలతో గొప్ప ప్రవర్తన ఉదాహరణను మనకు వారు చూపించారు. కాని గృహములలో పీడనమును సృష్టించేవారు చాలా మంది యున్నారు. వారి మనోభావాలను గుర్తించాలని వారు మనకు సూచించారు. పిల్లలతో అనురాగముతో

ప్రవర్తించవలెనని ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం మనకు బోధించిరి. ఇతరుల భావాలను కూడ గౌరవించాలని వారు సల్లల్లాహు అలైహి వసల్లం మనకు తెలిపిరి. వివాదములు, జగడముల నుండి దూరముండవలెనని వారు మనకు సూచించి, నేర్పించి, తమ ఆచరణతో తెలిపిరి. న్యాసములో అవినీతికి పాల్పడకూడదని వారు గట్టిగా బోధించిరి. ఇస్లాం బోధనలో కూడ గలదు. వారు మనకు చేసి కూడ చూపించిరి. పరిస్థితులు ఎలా యున్నా నిరాడంబరత చూపవలెను. సత్య గొప్ప విలువలను స్థాపించవలెను. వారు సల్లల్లాహు అలైహి వసల్లం ప్రతి ప్రవర్తనలో ఉత్తమ ఆదర్శము చూపిరి. మనము వాస్తవముగా ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లంను నిజమైన ప్రవక్తగా నమ్మినచో, హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంను వారి బానిసత్వములో వచ్చిన ఇమామ్‌గా నమ్మినచో మనము మన కర్మలను కూడ, మన ప్రార్థనల విలువలను కూడ గొప్ప స్థాయికి చేర్చవలెను. పవిత్ర ఖుర్‌ఆన్ ఆదేశములను చూచి దాని మంచి చెడు ఆదేశములను మనము గమనించి ఏ ఏ సత్కార్యములను మనము చేయుచున్నాము, వేటిని మనము చేయడం లేదని, ఏ ఏ పాపములను మనము వీడుచున్నాము, వేటిని మనము వీడడం లేదో చూసుకోవలెను. హ్రజత్ మసీహ్ మవూద్ అలైహిస్సలాం స్థాయిని, ప్రకటను సరిగ్గా అర్థము చేసుకోవలసిన అవసరం గలదు.

ఈ కాలము ప్రపంచమును అల్లాహ్ తఆలా కంటే దూరము తీసుకెళ్లినది. ప్రగతి పేరున వచ్చే ప్రతి దినము దూరము తీసుకెళ్లుటకు ఒక క్రొత్త ప్రయత్నము చేయుచున్నది. నేడు అల్లాహ్ తఆలాతో సంబంధము ఏర్పాటు చేసుకొనుటకు, అల్లాహ్ జ్ఞానము పొందుటకు ప్రయత్నించుట ఒక అహ్మదీ కర్తవ్యము. పొడిచే ప్రతి పొద్దులో ఈ జ్ఞానములో ప్రగతి చెందవలెను. ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం పట్ల ప్రేమాభిమానం కేవలం నోటి మాటలే కాకూడదు, నినాదాలు మాత్రమే చేయకుండా వారి గొప్ప ఆదర్శమును అనుసరించుచు ఈ ప్రేమాభిమానాన్ని చాటుకోవలెను. వారి పేరున నినాదాలు చేసిన తరువాత దౌర్జన్యము కూడ వారి పేరున చేయడం సబబు కాదు. కాని నేటి ముస్లిముల పరిస్థితి ఇటులనే యున్నది. చాలా సంస్థలు ఏర్పాటైనవి. ప్రభుత్వములు కూడ, సంస్థలు కూడ ఇస్లాం, ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం పేరున హింసకు పాల్పడుచున్నవి. సర్వ లోకాలకు కరుణగా అవతరించిన ఆ దయాసాగరున్ని తమ కర్మలతో హింసకు గురిచేయుచున్నారు. కాని వీరి ప్రయత్నములు సఫలము కాలేవు. అందుకే ఈ కాలములో మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం వచ్చిరి. ఇస్లాం నిజమైన చిత్రమును ప్రపంచానికి చూపుటకు మనము ప్రయత్నము చేయుచు పోతున్నాము.

ఈ నిజమైన చిత్రమును చూపుటకు మనము వారి ప్రతి ఆదర్శమును ఆచరించుటకు కృషి చేయవలెను. పవిత్ర ఖుర్‌ఆన్ అధికారమును అవలంభించుటకు ప్రయత్నించవలెను. మన ప్రతి కర్మ సత్కర్మలలో చేరాలని అనుక్షణం ప్రయత్నించవలెను. మనము ప్రతి క్షణం షైతాన్ నుండి దూరమగుచున్నామని, కారుణ్యమూర్తికి సమీపించుచున్నామని ప్రయత్నించుచుండవలెను. లేనిచో ఇతరులు కూడ నమాజ్ చేస్తారు, కాని వారి నమాజులు ఆకాశానికి చేరక భూమిపైనే యుండిపోతాయని వారు చెప్పినట్లు అగును. వినమ్రత లేని నమాజుల పట్ల ఆకాశమున యున్న అల్లాహ్ తఆలాకు ఎలాంటి ఆసిక్తి లేదు.

హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి. అల్లాహ్ తఆలాతో నిమజైన, పవిత్ర సంబంధము యున్నప్పుడే, అల్లాహ్ తఆలా ప్రీతి, విధేయతలో లీనమైనప్పుడే, ధర్మమునకు ప్రాపంచికముపై ప్రాధాన్యతనిచ్చినప్పుడే, అల్లాహ్ తఆలా మార్గములో ప్రాణమిచ్చుటకు, మరణించుటకు సిద్ధమైనప్పుడే నమాజులు నిజమైనవని అనిపించుకొనును. ఈ స్థితి మానవునిలో ఏర్పడినప్పుడు అతని నమాజ్ నిజమైన నమాజ్ అనబడును. కాని ఈ స్థితి మానవునిలో ఏర్పడనంత వరకు, నిజమైన వినమ్రత, విశ్వసనీయత ఉదాహరణ చూపనంత వరకు అతని నమాజులు, ఇతర కర్మలు ఎలాంటి ప్రభావము చూపవు.

నిజమైన పుణ్యమును తెలుపుచు వారిట్లనిరి. చిన్న చిన్న చెడు మార్గముల నుండి కూడ దూరముండుట దైవభీతి అనబడును. నేను సత్కార్యుడను, నేనెవరి ధనమును వృథా చేయలేదు, దోచుకోలేదు, దొంగతనానికి పాల్పడలేదు, చెడు చూపు చూడలేదు, వ్యభిచారము చేయలేదు అనుట మాత్రమే పుణ్యము కాదు. ఇటువంటి పుణ్యము జ్ఞాని దృష్టిలో హాస్యాస్పదం. ఎందుకనగా అతడీ పాపములు చేసినచో అనగా దొంగతనము, దోచుకొనుట,

వ్యభిచారము చేసినచో శిక్షకు గురగును. కనుక జ్ఞాని గౌరవించదగ్గ పుణ్యము కాదిది. ప్రజా సేవ చేయుట, అల్లాహ్ తఆలా మార్గములో సంపూర్ణ సత్యము, విశ్వసనీయతను ప్రదర్శించుచు, అతని మార్గములో ప్రాణము త్యాగము చేయుటకు సిద్ధమగుట నిజమైన పుణ్యము. అందుకే ఇట్లనెను. ఇన్నల్లాహ మఅల్లజీనత్తఖౌ వల్లజీన హుమ్ ముహ్సినూన్. అనగా పాపముల నుండి దూరముండుచు పుణ్యములు చేసినవారి వెంట అల్లాహ్ తఆలా యుండును. పుణ్యములు లేకుండా కేవలం పాపము నుండి దూరముండుట మాత్రమే విశిష్టత కాదని గట్టిగా గుర్తుంచుకొనుము.

పెద్ద పెద్ద పాపములలో అబద్ధమొక పాపము. దీని నుండి దూరముండాలని సూచించుచు ఒక సందర్భమున హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి. నేను గమనించితిని. పవిత్ర ఖుర్ఆన్‌లో వేల ఆదేశములు గలవు. వాటిని పాటించరు. చిన్న చిన్న విషయములలో అవిధేయతకు గురవుతారు. మనము చూచుచున్నట్లు కొందరు దుకాణాదారులు అబద్ధము చెబుతారు, కొందరు కల్పిత అబద్ధములాడుతారు. వాస్తవానికి అల్లాహ్ తఆలా దీనిని అపవిత్రముతో జోడించెను. కాని కల్పిత స్థితులను చెప్పుటకు వెనుకాడని చాలా మందిని చూడవచ్చును. పైగా దానిని పాపమని కూడ భావించరు. హాస్యము కొరకు కూడ అసత్యమాడుతారు. అసత్యమును అన్ని విధాలా వీడనిదే మానవుడు సత్యవంతుడని అనిపించుకోలేడు.

క్షమించుట ఒక గొప్ప సద్గుణము. యదార్థమేమనగా దీని వలన మానవుడు అనేక వివాదములు, జగడముల నుండి దూరముండును. ప్రపంచమును కూడ రక్షించును. ఈ విషయమును తెలుపుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి. జమాఅత్‌లో పరస్పరం కలహాలు అధికమైనట్లు నేను చూచుచున్నాను. సాధారణమైన విషయముల వలన ఒకరు మరొకరి గౌరవముపై దాడులు చేయసాగుతారు. దేవుని నామము రహస్యముగా యుంచువాడు. అలాంటప్పుడు ఒకరు తమ సోదరునిపై ఎందుకు కరుణ చూపరు. తన సోదరుని గౌరవము, మర్యాదను రక్షించుటకు అతన్ని ఎందుకు క్షమించడు. నేనొక చిన్న పుస్తకములో ఇట్లు వ్రాసి యున్నట్లు చూచితిని. ఒక రాజు ఖుర్ఆన్ వ్రాసేవాడు. ఈ సూక్తి తప్పుగా వ్రాశారని ఒక ముల్లా అనెను. ఆ సూక్తిపై రాజు గోళాకారము గీచి ఇది తొలగించబడునని చెప్పెను. ఇటువంటి విషయముల వలన మనసు చెడిపోవును. దీని నుండి దూరముండవలెను. ఈ విషయములన్నియు దైవభీతికి చెందినవి. బాహ్యాంతర విషయములలో దైవభీతిని అవలంభించిన వ్యక్తి దేవదూతలలో పరిగణింపబడును. ఎందుకనగా అతనిలో ఎలాంటి దుష్టత్వము మిగిలి యుండదు. దవైభీతిని పొందుము. దైవభీతి తరువాతనే అల్లాహ్ తఆలా శుభములందును. ధర్మబద్ధుడు ప్రాపంచిక ఆపదల నుండి రక్షింపబడును. దేవుడు వారిని రక్షించును. తమ సోదరులపై వెంటనే అపవిత్ర నిందలు మోపు అలవాటు చాలా మందిలో గలదు. ఈ విషయముల నుండి దూరముండుము. ప్రజలకు లబ్ది చూకూర్చుము. తమ సోదరులతో సానుభూతి చూపించుము. పొరుగువారితో సత్ప్రవర్తనతో వ్యవహరించుము. తమ సోదరులతో మంచిగా వ్యవహరించుము. అన్నిటి కంటే ముందు అన్యారాధన నుండి దూరముండుము. ఎందుకనగా ఇది దైవభీతికి గీటురాయి.

ఈ విలువలను పొందుటకు అల్లాహ్ తఆలా మనందరిని అనుగ్రహించుగాక! వారి బైఅత్‌లో చేరిన తరువాత వారి అవతరణ ఉద్దేశమును అర్థము చేసుకొనువారమగుదుము గాక, దానిని పూర్తి చేయువారమగుదుము గాక! తమ సర్వ శక్తులను ఒడ్డి తమ ప్రతిభను ఉపయోగించువారమగుదుము గాక! ఈ వాస్తవికతను ప్రపంచానికి తెలియజేయువారమగుదుము గాక! ☆☆☆

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Hafiz Syed Rasool Niyaz, Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

To,

........................................................................

........................................................................

........................................................................